www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 సెప్టెంబరు 2023

5

పశ్చిమ గోదావరి



వికలాంగులకు అండగా ప్రభుత్వం : ఎంఎల్‌ఎ




వికలాంగునికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంఎల్‌ఎ

పెనుగొండ: వికలాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగ నాథరాజు తెలిపారు. పెనుగొండలో వికలాంగులకు మూడు చక్రాల మోటార్ గురువారం వాహనాలు అందజేశారు. నలుగురికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రంగనాథరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ శ్రీనివాస్ దొర, ఇలపర్రు సర్పంచి దండు పద్మావతి, జెడ్‌పిటిసి కోడూరు గోవర్ధన్, ఎంపిపి పి.వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రుణాలు అరకొరే..!

రెండు జిల్లాల్లోనూ వ్యవసాయసాగులో కీలక పాత్రపోషిస్తున్న కౌలురైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. పంటసాగుచేస్తున్న వాస్తవ కౌలురైతులకు పంటరుణాలందని పరిస్థితి నెలకొంది. అరకొర రుణాలు మంజూరు చేసి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింతదారుణంగా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూయజమానులకు అవగాహన కల్పించడంలోగానీ, కౌలుకార్డులు జారీచేసిన రైతులకు రుణాలిప్పించేందుకు చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బ్యాంకురుణాలందకపోవడంతో పెట్టుబడుల కోసం కౌలురైతులు ప్రయివేటు వడ్డీవ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు.

- కౌలు రైతులకు మొండిచేయి
- పట్టించుకోని ప్రభుత్వం
- కౌలుకార్డులు జారీచేసినా రుణాలివ్వని పరిస్థితి
- ఏలూరు జిల్లాలో 58 వేల కౌలుకార్డుదారుల్లో 13 వేల మందికే లబ్ధి
- 'పశ్చిమ'లో 88వేల మందిలో 26 వేల మందికే రుణాలు
- ప్రయివేటు వడ్డీవ్యాపారుల కబంధహస్తాల్లో కౌలురైతులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండుజిల్లాల వ్యవసాయసాగులో కౌలురైతులదే కీలకపాత్ర. సాగుచేస్తున్న భూమిలో 75 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో సాగుచేస్తున్న కౌలురైతుల గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కౌలుకార్డుల జారీ, పంటరుణాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. 2023-24 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకూ బ్యాంకులు కౌలురైతులకు జారీచేసిన రుణాలు లెక్కలు చూస్తే పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చు. అరకొరగా రుణాలు జారీచేసి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో కొంత ఫర్వాలేదనిపించినప్పటికీ, ఏలూరు జిల్లాలో మాత్రం కౌలురైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లాలో 58,452 కౌలుకార్డులు జారీచేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. కౌలుకార్డులు జారిచేసిన రైతులకైనా రుణాలిచ్చారా అంటే అదీలేకుండా పోయింది. కేవలం 13వేల మందికి మాత్రమే రూ.52కోట్ల వరకూ రుణాలు మంజూరుచేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. దాదాపు కౌలుకార్డులు అందుకున్న 45వేల మంది కౌలురైతులకు రుణాలందని పరిస్థితి నెలకొంది. వీరంతా పంటరుణాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో 88వేల మంది కౌలురైతులకు కౌలుకార్డులు మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. బ్యాంకు రుణాలు అందుకున్న కౌలురైతులు 26 వేల మంది మాత్రమే. వీరికి మంజూరు చేసిన రుణాలు రూ.130 కోట్లు మాత్రమే. కౌలుకార్డులు అందుకున్న దాదాపు 60వేల మందికిపైగా కౌలురైతులకు రుణాలివ్వ లేదు. ఈ జిల్లాలో జెఎల్‌జిఎల్, ఆర్‌ఎంజిఎల్ గ్రూపుల ద్వారా రూ.195 కోట్ల వరకూ రుణాలిచ్చినట్లు తెలుస్తోంది. ఇది రైతులకు కొంత ఉపశమనం కల్పించే చర్యగా చెప్పొచ్చు. ఏదిఏమైనా వ్యవసాయ రుణ ప్రణాళికల్లో కౌలురైతులకు కేటాయించిన రుణాలు ఒక్కశాతం కూడా లేకుండాపోయింది. కనీసం కౌలుకార్డులు జారీచేసిన రైతులకు కూడా రుణాలివ్వకపోడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. దీంతో పెట్టుబడులకోసం కౌలురైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధహస్తాల్లో కౌలురైతులు

వాస్తవసాగుదారుడైన కౌలురైతులకు బ్యాంకులు పంటరుణాలందించడం లేదు. అరకొర రుణాలు జారీచేసి బ్యాంకులు మమ అనిపిస్తున్నాయి. ప్రభుత్వం సైతం కౌలురైతులకు రుణాలు మంజూరు గురించి గట్టి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడులకోసం ప్రయివేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. నూటికి రూ.మూడు, రూ.ఐదు వడ్డీకి అప్పులు తెచ్చి కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. దీంతో వడ్డీభారం తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. ప్రతిఏటా ప్రకృతివైపరిత్యాలతో పంటలు దెబ్బతినడంతో అప్పులు తీరక, వడ్డీ భారంగా మారుతోంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలురైతుల రుణాల జారీకి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటేనే కౌలురైతులకు ఎంతోకొంత న్యాయం జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.



భీమవరంలో జిపిఎస్ బిల్లు కాపీలను దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

జిపిఎస్ రద్దు చేసే వరకూ..

యుటిఎఫ్ పోరాటం

పలు చోట్ల జిపిఎస్ బిల్లుల కాపీలు దహనం

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్ రద్దు చేయకుండా జిపిఎస్ అమలు చేసేందుకు బిల్లు ప్రవేశపెట్టి ఏకపక్షంగా ఆమోదించడం అత్యంత దుర్మార్గమని జిపిఎస్‌ను రద్దు చేసేంత వరకూ యుటిఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అన్నారు. అసెంబ్లీలో జిపిఎస్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లును వెనక్కి తీసుకోవాలని, డిమాండ్ చేస్తూ గురువారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రకాశంచౌక్ వరకూ ర్యాలీ, ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. జిపిఎస్‌కు సంబంధించిన కాపీలను దహనం చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు మాట్లాడారు. పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో కాలయాపన చేయడం తప్ప ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ఏం చేశారని విమర్శించారు. అసెంబ్లీలో జిపిఎస్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం ఎంతవరకూ సమంజమని ప్రశ్నించారు. జిపిఎస్ రద్దు చేసే వరకూ యుటిఎఫ్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడుతూ సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఒపిఎస్ మాత్రమేనని హితవు పలికారు. అసెంబ్లీలో ఆమోదించిన మోసపూరితమైన జిపిఎస్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే అందరికీ పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కెఎస్‌సిహెచ్.సాయిరామ్, సిహెచ్.కుమారబాబ్జి, డి.ఏసుబాబు, కెఎస్.రామకృష్ణ ప్రసాద్, బిజెవిడి.రాజ్యలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, మండల నాయకులు బి.నాగబాబు, బి.లక్ష్మీనారాయణ, బిఆర్‌ఎంకె.స్వామి, కె.త్రిమూర్తులు, పి.రాజబాబు, సీనియర్ నాయకులు పి.సీతారామరాజు, శ్రీరంగరాజు పాల్గొన్నారు.

తణుకురూరల్: సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ తణుకు డివిజన్ కన్వీనర్ టిజె.జయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో జిపిఎస్ బిల్లు ప్రవేశపెట్టి చట్టం రూపంలో ఆమోదించడాన్ని నిరసిస్తూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఒపిఎస్‌కు బదులు జిపిఎస్‌ను చట్టం రూపంలో తీసుకురావడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరన్న, ఇరగవరం ప్రధాన కార్యదర్శి వీరరాఘవులు, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.రవి, అత్తిలి ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, మండలాల అధ్యక్షులు ఎ.మాణిక్యమ్మ పాల్గొన్నారు.



తణుకులో యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిఒ ప్రతులను దహనం చేస్తున్న నేతలు

30న మెగా మెడికల్ క్యాంపు

12 మంది స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం పార్టీ క్యాంపు కార్యాలయంలో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ శనివారం తాడేపల్లిగూడెం మూడో వార్డు వీకర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 12 మంది వివిధ రకాల స్పెషలిస్టు డాక్టర్లు వైద్య సేవలందిస్తారని తెలిపారు. వీరు కాకుండా మరో నలుగురు అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్లు కూడా సేవలందిస్తారని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రత్యేకించి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని పరికరాలతో కూడిన రెండు ప్రత్యేక వాహనాలను రప్పిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి నవంబర్ 15వ తేదీ వరకూ 2 నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి క్లస్టర్ పరిధిలోని కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లోని ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తారన్నారు. ఏడు రకాల పరీక్షలను ఉచితంగా చేసి కేసు షీట్‌ను రూపొందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి మరింత మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆసుపత్రులకు పంపించి ప్రభుత్వమే ఉచితంగా అవసరమైన శస్త్ర చికిత్సలు చేయిస్తుందన్నారు. అంతేకాకుండా మందులు కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుందన్నారు. గైనకాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, ఆంకాలజీ, డెంటల్ వివిధ రకాల స్పెషలిస్టులు ఈ శిబిరంలో వైద్య సేవలందిస్తారని తెలిపారు. దీనికోసం 15 రోజులుగా 1 నుంచి 7 వార్డుల వరకూ గల సుమారు 7 వేలకు పైగా గృహాలను వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో 4,676 మందికి టోకెన్లు జారీ చేశారన్నారు. టోకెన్లతో నిమిత్తం లేకుండా అవసరమైన వారంతా ఈ శిబిరానికి వచ్చి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, వైసిపి పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి యువ నాయకులు కొట్టు విశాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

నాగేంద్రనాథ్ మృతి రైతు ఉద్యమానికి తీరనిలోటు

భీమవరం: ప్రముఖ రాష్ట్ర రైతు సంఘం నాయకులు యర్నేని.నాగేంద్రనాథ్ (చిట్టిబాబు) మృతి రైతు ఉద్యమాలకు తీరని లోటని రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి లంకా .కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు దండు.శ్రీనివాసరాజు, వ్యవసాయ కమిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి అన్నారు. గురువారం నాగేంద్రనాథ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటూ రాష్ట్రంలో అనేక రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి నాగేంద్రనాథ్ సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు.

స్వామినాథన్ మృతి రైతులకు తీరని లోటు

వ్యవసాయ రంగానికి, రైతులకు స్వామినాథన్ మృతి తీరని లోటని అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా.కృష్ణమూర్తి అన్నారు. స్వామినాథన్ మృతి చెందడం పట్ల ఆయన గురువారం సంతాపం వ్యక్తం చేశారు. వరి సాగుపై అనేక పరిశోధనలు జరిపి, రైతులకు అందించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. సాగులో రైతులు పెట్టిన ఖర్చులకు, భూ యజమాని జీతం ప్లస్ భూమి కవులు, కలిపి వచ్చిన ఆదాయానికి 50 శాతం, అధికంగా ఎంఎస్‌పి నిర్ణయం కావాలని చెప్పిన వ్యక్తి ఆయన అన్నారు.

స్వామినాథన్ మృతికి సిపిఎం సంతాపం

భీమవరం : ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం తెలిపింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వామినాథన్ దేశంలో వ్యవసాయరంగ పరిశోధనలకు, అభివృద్ధికి మూలస్తంభం వంటివారని తెలిపారు. అంకితభావం, దేశభక్తి, చిత్తశుద్ధి, దేశ ఆహార భద్రత పట్ల నిబద్ధత స్వామినాథన్ కృషికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు ఆయన స్ఫూర్తితో వ్యవసాయరంగాన్ని ఆదుకోవడానికి, రైతుల ఆత్మహత్యల నివారణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. స్వామినాథన్ కుటుంబం మొత్తం దేశాభివృద్ధికి కృషి చేసేలా నిలబడడం ఆదర్శమని పేర్కొన్నారు.

పోడూరు: స్వామినాథన్ మృతిపై రైతు సంఘం సంతాపం వ్యక్తం చేసింది. స్వామినాథన్ దేశంలో రైతాంగానికి నిరంతర స్మరణీయుడని, ఆయన కృషి దేశాన్ని ఆహారోత్పత్తిలో బలోపేతం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని సుసంపన్నం చేశారని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి జుత్తుగ నరసింహమూర్తి, ఆకుల హరే రామ్ తెలిపారు. ఆయన రైతులు పండించిన పంటకు మద్దతు ధర నిర్ణయానికి శాస్త్రీయంగా ప్రతిపాదనలు చేసారని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు తెలిపారు. ఈ సభలో ఆయన చిత్రపటానికి రైతు సంఘం నాయకులు జుత్తుగ శ్రీరామచంద్రుడు, చిర్ల పుల్లారెడ్డి, కె.వెంకట్రావు, సూర్యారావు, లక్ష్మీకుమారి నివాళులర్పించారు.

గుర్రం జాషువా కవితలు స్ఫూర్తిదాయకం


జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

గుర్రం జాషువా కవితలు స్ఫూర్తిదాయకమని, ఆయనను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులు చదివి మంచి స్థానాలను చేరుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. గురువారం కలెక్టరేట్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి డిఆర్‌ఒ కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసి రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ఆనాడు అస్పృశ్యత, అంటరానితనం రూపుమాపడానికి గుర్రం జాషువా తన కవితలతో చైతన్యం కలిగించారన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడుతూ తెలుగు కవుల్లో ప్రముఖ స్థానం పొందిన కవి గుర్రం జాషువా అన్నారు. సమకాలీన భావ కవిత్వ రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశారన్నారు. కవులు తెన్నేటి లక్ష్మి నరసింహమూర్తి, కోలాటి పెద్దిరాజు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి జివిఆర్‌కెఎస్‌ఎస్.గణపతిరావు, డిఎస్‌ఒ ఎన్.సరోజ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి ఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ, ఆర్‌డిఒ



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ వాటర్ లారీ ట్యాంకర్



నీటిని నింపుకుంటున్న అద్దె వాటర్ ట్యాంకర్

నిరుపయోగంగా వాటర్ ట్యాంకర్లు..!

అద్దె వాహనాలతో తాగునీరు సరఫరా, సొంత వాహనాలకు మరమ్మతులు నిల్ - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మున్సిపాల్టీలో వివిధ పనులకు వినియోగించే సొంత వాహనాలను మరమ్మతుల కారణం చూపుతూ అద్దె వాహనాలపై మక్కువ చూపుతున్నారు. ఫలితంగా మున్సిపాల్టీకి వాహనాల అద్దె భారంగా మారింది. కొందరు మున్సిపల్ అధికారులు కమీషన్‌కు కక్కుర్తిపడి అద్దె వాహనాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భీమవరం పట్టణంలో చివరి ప్రాంతాల ప్రజలకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసేవారు. అయితే కొంతకాలంగా మున్సిపాల్టీకి చెందిన వాటర్ ట్యాంకర్లు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నీటి సరఫరా సమయంలో మరమ్మతులకు గురయ్యాయి. అయితే వాటిని మరమ్మతులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా ట్యాంకర్లు మూలన పడ్డాయి. మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా మారాయి. ఎప్పటికప్పుడు వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో లక్షల రూపాయల విలువ చేసే ట్రాక్టర్లు నిరుపయోగంగా మారాయి. మున్సిపాల్టీ అధికారులు సొంత ట్యాంకర్లను వదిలి అద్దె వాటర్ ట్యాంకర్లే ముద్దు అనే విధానంలో వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో సొంత వాహనాలు మూలకు చేరడంతో పెద్ద మొత్తంలోనే మున్సిపాల్టీకి నష్టం వాటిల్లుతోంది. మరోపక్క అద్దె ట్యాంకర్ల వల్ల మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఒకపక్క భీమవరం జిల్లా కేంద్రం ఏర్పడిన నాటి నుండి స్థానిక శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ పట్టణంలోని పలు సమస్యలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే గతంలో తాగునీటి సరఫరా సిబ్బంది ఎటువంటి బిల్లు లేకుండా నీటిని బయటి వారికి అమ్ముకుని సొమ్మును జేబులో వేసుకునేవారు. అలాంటి వారి ఆటలు కట్టించారు. అయితే భీమవరం మార్కెట్లో ఉన్న సర్వీస్ రిజర్వాయర్ వన్‌లో ఒక లారీ వాటర్ ట్యాంకుతోపాటు, మూడు ట్రాక్టర్ ట్యాంకర్లు, రెండు ట్రాక్టర్ ఇంజన్లు రకరకాల రిపేర్లు కారణంగా అధికారులు మూలకు తోసేసి, అద్దె వాటర్ ట్యాంకర్లపై వాటర్‌ను సరఫరా చేస్తున్నారు. దీంతో ఎటువంటి వాడకం లేక మూలకు పెట్టేసిన మున్సిపల్ ట్యాంకర్లు ఎండకెండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టాయి. ఇప్పటికైనా పాడైన ట్యాంకర్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఏలూరు జిల్లాకు యుటిఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి

విజయవాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీకాకుళంలో ప్రారంభమైన ప్రచారయాత్ర గురువారం చింతలపూడి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్ర ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, ముస్తాఫాఆలీ, టి.నరసాపురం, చింతలపూడి మండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



చింతలపూడిలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ద్వారకాతిరుమల : యుటిఎఫ్ స్వర్ణోత్సవాల ర్యాలీ గురువారం ఉదయం ద్వారకాతిరుమల చేరుకుంది. ఈ సందర్భంగా యుటిఎఫ్ భవనంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్‌ఎస్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడలో వచ్చేనెల ఒకటో తేదీన పదివేల మందితో సభ నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.గోపిమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు



ధరల పట్టిక ఏర్పాటు చేయించిన అధికారులు

ధరల పట్టిక ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

సినిమా టిక్కెట్ల ధరలు తెలియజేస్తూ రెవెన్యూ అధికారులు గురువారం బోర్డులను ఏర్పాటు చేయించారు. థియేటర్లలో జేబులకు చిల్లు శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి తహశీల్దార్ జి.అనితకుమారి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు విఆర్ఒ సుభాషిని, విఆర్ఎ చంటి రేట్ల వివరాలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయించారు.

జిల్లా స్థాయి రైతాంగ శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

రైతు సంఘ జిల్లా స్థాయి రైతాంగ శిక్షణా తరగతులు మండలంలోని కవిటంలోని పరుసరామిరెడ్డి కళ్యాణమండపంలో గురువారం ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వర్షాభావంతో అధిక మండలాలు కరువు మండలాలుగా మారిపోయాయన్నారు. పంట ప్రారంభంలోనే ఎండిపో వడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. బ్యాంక్ రుణాలు రద్దు చేసి తదుపరి పంటకు రుణాలు ఇవ్వాలని కోరారు. తరగ తులకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహ మూర్తి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట చేతికి వస్తుందని, ప్రభుత్వం గత రబీ సీజన్‌లోని ఇబ్బందులను గమనించి ముందుగానే సంచులు, బరకాలు, సదుపా యాలు కల్పిం చాలని కోరారు. జిల్లా అధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిపిఎం మండల కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దక్షిణామూర్తి

గుర్రం జాషువ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - తణుకు రూరల్

మనుషుల మధ్య సామాజిక అంతరాలను తొలగించడానికి, సమానత్వం నెలకొల్పడానికి అక్షరాన్ని ఆయుధంగా మలచుకున్న కలం వీరుడు, నవయుగ కవి చక్రవర్తిగా పేరుగాంచిన గుర్రం జాషువా అని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్ర బాధ్యులు పి.దక్షిణామూర్తి అన్నారు. గురువారం గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకుని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యాక్రమంలో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ జాషువా గొప్ప దేశభక్తుడని, స్త్రీవాద సాహిత్యాన్ని తన రచనల్లో ప్రతిబింబించేశాడని చెప్పారు. మత మూఢత్వాన్ని, మూఢ నమ్మకాల్ని, కులతత్వాన్ని వ్యతిరేకించాడని, అటువంటి గొప్ప రచయిత ఆశయాల సాధనకు శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, సీతారామయ్య, గోపి, కామన మునిస్వామి, అడ్డగర్ల అజయకుమారి పాల్గొన్నారు.



డ్యాన్స్ పోటీల్లో చిన్నారులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ సర్వీస్ మంత్‌లో భాగంగా గురువారం సీనియర్స్, జూనియర్స్ విభాగంలో డ్యాన్స్ పోటీలు లయన్స్ క్లబ్‌లో నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ తెలిపారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, క్లబ్ సెక్రటరి రావాడ సతీష్, మాజీ ప్రెసిడెంట్ చందక రాము, కటారి నాగేంద్రకుమార్, పివి.సుబ్బరాజు, ముత్యాల శ్రీనివాస్, వి.గంగాధర్, కానూరు ప్రభాకర్, పాతాబతుల సత్యనారాయణ, తెన్నేటి శ్యాంబాబు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు తొమ్మిదో వార్డు మెంబర్ పత్తికాయల శ్రీనివాస్(47) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను గురువారం పలువురు పరామర్శించారు. ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మానవత ఆత్మీయ కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పరామర్శించారు. పత్తికాయల శ్రీనివాస్ మహోన్నత విలువలు కలిగిన మానవతావాది అని మానవత జిల్లా అధ్యక్షులు కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా సెక్రటరీ కొత్త సత్యనారాయణమూర్తి, మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, సెక్రటరీ బండి ప్రసాద్, సిఎస్ఆర్, చిర్ల శ్రీనివాసరెడ్డి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కోణాల నర్సిరెడ్డి, రొబ్బి భాస్కరరావు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ గ్రంధిని కలిసిన సిఐ సత్యకిషోర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం రూరల్ సిఐగా బదలీపై వచ్చిన బి.సత్యకిషోర్ గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పెదగోపురంలో బుధవారం జరిగిన హుండి లెక్కింపులో అవకతవకలు జరిగాయని సోషల్‌మీడియాలో ఆధారం లేని పోస్టు పెట్టిన గేదెల లక్ష్మణరావుపై పోలీస్ కేసు నమోదైంది. ఈ మేరకు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ ట్రస్టీలు గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి ఆరోపణలు రాలేదని, హుండీ లెక్కింపు, దేవాదాయ శాఖ అధికారులు, బ్యాంక్, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ పర్యవేక్షణలో, సిసి కెమెరా సాక్షిగా జరుగుతాయని ఛైర్మన్ చెప్పారు. కేవలం ఆలయం, హిందూ సంస్థలను కించపరచాలనే ఉద్దేశంతో సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టినట్లు చెప్పారు. వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని, వారు కూడా పోలీస్ కేసు పెట్టాలని సిఫార్సు చేశారని చెప్పారు.

కరెంటు కష్టాలు తీరేనా..!

వేధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలు

చిన్నారులు, వృద్ధుల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి

కరెంట్ కోతలతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో విద్యుత్ అధికారుల మాటలకు చేతలకు పొంతన లేకపోవడంతో పలువురు విస్మయానికి గురవుతున్నారు. మండలంలో 24 గంటలు పూర్తిస్థాయిలో గృహ వినియోగదారులకు విద్యుత్‌ను అందిస్తామని చెబుతున్నప్పటికీ తమ ప్రాంతంలో కరెంటు కష్టాలు వెంటాడటం ఏంటని విద్యుత్ అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రమైన ఉండిలో మెయిన్ విలేజ్‌లో విద్యుత్ సరఫరా చేస్తూ గేటు అవతల ఉన్న పెదపుల్లేరు రహదారి, గోరింటాడ పలు ప్రాంతాల్లో నిత్యం కరెంటు కోతలు విధించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కాలం నుంచి కరెంటు కోతలతో నిత్యం ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేయకుండా ఆక్వా చెరువులకు విద్యుత్ సక్రమంగా సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. గురువారం ఉదయం సుమారు తొమ్మిది గంటల నుంచి నిరవధికంగా కరెంటు కోతలు విధించడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీర్ ముదునూరి మాధవరాజుకు ఫిర్యాదు చేయడానికి వెళ్లిన ఆయన అందుబాటులో లేరని ప్రజలు వాపోతున్నారు.

మత ప్రమేయాల్లేని రాజకీయాలు అవసరం



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పివి.ప్రతాప్


ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మత ప్రమేయాలు లేని రాజకీయాలు దేశానికి అవసరమని సిపిఎం జిల్లా నాయకులు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వర రావు అన్నారు. హిందూత్వ రాజకీయాలు- ప్రతిఘటనా పద్ధతులు నయా ఉదారవాద ఆర్థిక విధానాలు - ప్రభావం అంశంపై స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కరెడ్ల రామకృష్ణ అధ్యక్షతన గురువారం మొదటిరోజు శిక్షణా తరగతులు నిర్వహిం చారు. ఈ శిక్షణా తరగతులుకు సిపిఎం జిల్లా నాయకులు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, బిజెపి కూటమి తామే అందరికన్నా గొప్ప దేశభక్తులమని ప్రచారం చేస్తుందన్నారు. విమర్శించిన వారంతా దేశద్రోహులని ఎదురుదాడి చేస్తున్నారన్నారు. మత ప్రమేయం లేని రాజకీయాలు దేశానికి అవసరమ న్నారు. కార్మికుల మతవిశ్వాసాలను బట్టి కార్మికులను చీల్చి కార్మికోద్యమాన్ని బలహీన పరచడానికి రాజకీయాలు చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకన్న పాల్గొన్నారు.

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు ఘన సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

గణేశ్న భాను శ్రీలక్ష్మీఅన్నపూర్ణ ప్రత్యూష గ్రూపు-1 పరీక్షల్లో తొలి ర్యాంకు సాధించి ఏలూరు జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులై స్వగ్రామమైన సీసలి గురువారం ఇచ్చేశారు. ఆమె తొలుత సీసలి సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. ట్రైని డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషకు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, ఛైర్మన్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఆలయం వద్ద గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గ్రామమంతటా కారులో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రైని డిప్యూటీ కలెక్టర్ ఇంటి వద్ద గ్రామస్తులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి కత్రేడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరంతర శ్రమతోనే ప్రత్యూష ట్రైని డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రత్యూష మాట్లాడుతూ పటిష్టమైన పునాది.. మనపై మనకు నమ్మకం ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా సులువుగా సాధించవచ్చన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా తన తండ్రి ప్రోత్సహించారన్నారు. భవిష్యత్తులో సివిల్స్‌కు ప్రయత్నిస్తా నన్నారు. ఈ కార్యక్రమంలో గణేశ్న వెంకట రామాంజనేయులు, గణేశ్న ఉష, తోట వెంకయ్య, మాజీ ఎంపిటిసి కత్రేడ్డి విజయలక్ష్మి, గణేశ్న పద్మారావు, నల్ల శ్రీను, గణేశ్న వెంకట రామకృష్ణ, గ్రామ సర్పంచి బిల్లకుర్తి ధనలక్ష్మి శ్రీనివాస్, తోట ఫణిబాబు, తోట హరిబాబు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నప్రసాద్, కోరా రామ్మూర్తి, జివి.నాగేశ్వరరావు, ఎరుబండి రామాంజనేయులు, వాస్మూరి శ్రీనివాసు పాల్గొన్నారు.



ప్రత్యూషకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, ఛైర్మన్

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పి.సాగర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాగర్ మాట్లా డుతూ బ్రిటిష్ తెల్ల దొరలకు వ్యతిరేకంగా, పరాయి పాలన నుంచి విముక్తి కోసం, భారతదేశపు స్వతంత్రం కోసం 23 ఏళ్ల వయసులోనే ఉరికంబాన్ని ముద్దాడిన గొప్ప విప్లవ పోం ాట యోధుడు భగత్ సింగ్ అన్నారు. పట్టణ ఉపాధ్యక్షులు బి.గణేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఉద్యోగ సాధన కోసం పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.హరి, టి.వాసు, కె.వరుణ్ పాల్గొన్నారు.

ఆచంట : భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో దేశంలో నిరుద్యోగం, మతోన్మాదం అంతమయ్యేవరకు ఐక్య ంగా పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ పిలుపునిచ్చారు. స్థానిక ఎంవిఆర్ జూనియర్ కళాశాల వద్ద, కచేరి సెంటర్‌లలో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పిల్లి చంటిబాబు అధ్యక్షత వహించారు. జూనియర్ కళాశాల వద్ద ఫిజిక్స్ ఉపాధ్యాయులు డి.బాలాజీ శ్రీనివాస్, ఆచంట కచేరి సెంటర్లో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి ఉపాధ్యాయులు పెద్దింటి సీతారామాచార్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎం.శివ, వి.రాము, ఎ.సాయికుమామార్, వి.పవన్‌కృష్ణ, మేకా కృపావరం, ఎ.థెరిస్సా, ఎన్.సత్యలక్ష్మి, పద్మ ధనలక్ష్మి, వి.సౌమ్య, జాహ్నవి, కె.షాలిని పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : భగత్ సింగ్ జయంతిని భీమవరం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సిపిఐ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. సోషలిస్టు సమాజం కోసం యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, భీమవరం రూరల్ కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, నాయకులు వైవి.ఆనంద్, పాలా త్రిమూర్తులు, ఛాంద్ బాషా పాల్గొన్నారు.

అధ్వానంగా జాతీయ రహదారి

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - ఉండి



బోల్తా పడిన ఆటో

అది పేరుకే జాతీయ రహదారి కాని అభివృద్ధి లేకుండా సుమారు రెండు కిలోమీటర్ల మేర గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు బోల్తా పడుతున్నాయి. మచిలీపట్నం నుంచి నారాయణపురం చేపల లోడుతో వెళ్తున్న కృష్ణాజిల్లా మూలలంక చెల్లింకుల బసవన్నకు చెందిన ట్రక్ ఆటో జాతీయ రహదారి 165పై ఉన్న ఉండి గ్రామంలో బోల్తా పడింది. ట్రక్ ఆటో కాబట్టి డ్రైవర్ మాత్రమే స్వల్ప గాయాలతో బయటపడ్డాడని, అదే ప్యాసింజర్ ఆటో అయితే ఎంతమంది గాయాలపాలయ్యే వారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఉండిలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలువురు కలెక్టర్ పి.ప్రశాంతి దృష్టికి అధ్వాన స్థితిలో ఉన్న జాతీయ రహదారి విషయాన్ని తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ పి.ప్రశాంతి జాతీయ రహదారి మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేశారని పలువురు విస్మయానికి గురయ్యారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే రహదారి గుంతలమయం కావడంతో వాహనదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి, జనసేన నాయకులు శ్రమదానం చేసి రోడ్డు కొంతభాగం బాగు చేసినప్పటికీ మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు యధాస్థానానికి చేరిందని, పూర్తిస్థాయిలో రోడ్డును బాగు చేయిస్తే ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు సుఖవంతంగా ప్రయాణిస్తారని కోరుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు దీనిపై స్పందించి రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజయ ల్యాబ్‌కు జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా పాలకొల్లులోని విజయల్యాబ్‌కు జాతీయ అక్రిడిటేషన్ బోర్డు ఎన్ఎబిఎల్ గుర్తింపు ఇచ్చినట్లు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి ప్రకటించారు. ఈ మేరకు ల్యాబ్ ఆవరణలో గురువారం గుర్తింపు సర్టిఫికెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రులు ఇప్పటివరకు కేన్సర్, థైరాయిడ్ టెస్ట్‌లకు హైదరాబాద్, ముంబై ప్రాంతాలకు శాంపిల్స్ పంపేవారమని, దీంతో రోగికి వ్యయప్రయాసలు అయ్యేవని చెప్పారు. ఇప్పుడు పాలకొల్లులో క్వాలిటీ విశ్లేషణతో ఈ సౌకర్యం లభించడం వైద్యులకు, రోగికి ఎంతో సౌకర్యమన్నారు. డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పాలకొల్లు వంటి ప్రాంతాల్లో క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉండటం ఆశ్చర్యంగా ఉందన్నారు. తరచూ రక్త నమూనాలు, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇచ్చారు. 25 ఏళ్లగా ల్యాబ్ నిర్వహిస్తూ నేడు జిల్లాలోనే జాతీయ గుర్తింపు ల్యాబ్‌గా తీర్చి దిద్దిటం పట్ల వైద్యులు డాక్టర్ జయ దుర్గాదేవి, నిర్వాహకులు కొమ్ముల మురళీకృష్ణ, సతీమణి శ్రీలక్ష్మిలను అభినందించారు.



ఎన్ఎబిఎల్ ల్యాబ్ లోగో ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్ఎ బాబ్జి

చంద్రబాబు అరెస్టుపై కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి - పాలకొల్లు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 16వ రోజు గురువారం దీక్షల్లో రజకులు పాల్గొన్నారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కొంత సేపు ఇస్త్రీ చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మామిడిశెట్టి పెద్దిరాజు, పెచ్చెట్టి బాబు, జివి, పెన్మెత్స రామభద్రరాజు, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆచంట : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ నేతృత్వంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 16వ రోజు గురువారం కొనసాగాయి. ఈ సందర్భంగా కోడేరు వశిష్ట గోదావరిలో టిడిపి నాయకులు జల దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మం డల అధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు నరసింహమూర్తి, శ్రీరా మ్మూర్తి, ప్రసాద్, సీతారాం, ప్రభాకర్, మురళి, సత్యనా రాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉండిలో గురువారంతో 15వ రోజుకు చేరాయి. నియోజకవర్గ తెలుగు మహిళలు దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్‌కళ, మంతెన కృష్ణకుమారి, కునుకు రమాదేవి, వత్సవాయి సుజాత, గుగ్గిలపు శ్రీదేవి, దొంగ భారతి, మజ్జి వెంకట రామలక్ష్మి, పి.విజయలక్ష్మి, జె.మంగమ్మ, పి.శ్రీదేవి, చొక్కాపు మహేశ్వరి, గుడాల మరియమ్మ, బొర్రా సుజాత, ఇల్లాపు కృష్ణవేణి, షేక్ చిన్నారి బిబి, గురుగుబిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు అరెస్టుపై నిరస నగా టిడిపి నాయకులు నల్ల బెలూన్లతో నిరసన ప్రద ర్శన చేశారు. మండలంలోని ముత్యాలపల్లిలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద టిడిపి నాయకులు నల్ల కండువాలు కప్పుకుని, నల్ల బెలూన్లతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, కొల్లాడి బాలకృష్ణ, శ్రీను, కొల్లాటి మూలా స్వామి, నాగేశ్వరరావు, తులసిరావు, సాయిబాబు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా టిడిపి భీమవరం నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలో ఆ పార్టీ మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంటా త్రిమూర్తులు దీక్షలు ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షుడు రేవు వెంకన్న ఆధ్వర్యంలో నిరాహారదీక్ష శిబిరం పరిసర ప్రాంతంలో టిడిపి నాయకులు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ వైసిపి అరాచక ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి వీరవాసరం మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్, భీమవరం పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు, నాయకులు బొడ్డు మోహన్, వీరమల్లు సూరిబాబు, కొయ్యలగడ్డ గణపతి, కొల్లాటి గోవింద్, కొల్లాటి నరసింహస్వామి, వెంకటేశ్వరరావు, బొమ్మిడి మధు, పొన్నాల నరసింహస్వామి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి నేతృత్వంలో తెలుగు తమ్ముళ్లు గురువారం పెంటపాడు కాలువలో అర్ధనగ్న జల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు. తొలుత నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లికార్జునరావు రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్న శిబిరం వద్ద దీక్షలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ చేయించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అర్ధ నగ్న జల దీక్ష నిర్వహించారు. టిడిపి తాడేపల్లిగూడెం రూరల్ అధ్యక్షుడు పరిమి రవికుమార్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, జెడ్‌పిటిసి సభ్యులు కిలపర్తి వెంకట్రావు, ఏరుబండి సతీష్, దాసరి అప్పన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పాలకోడేరు

పరిస రాల పరిశుభ్రతతో ఆరోగ్యం దరి చేరుతుందని గొరగనమూడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీరాజు) అన్నారు. గొరగనమూడిలో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొరగనమూడి గ్రామంలోని డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారితో పాటు డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలను, సచివాలయ పరిసర ప్రాంతాలు, ఆరోగ్య సహాయ కేంద్రాల ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చగడ్డి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దానికితోడు వర్షపునీరు కూడా నిలిచిపోయి ఉండటంతో సర్పంచి శివాజీరాజు పరిసర ప్రాంతాలను బాగు చేయించారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న సర్పంచి శివాజీరాజు చేస్తున్న సేవల పట్ల వైద్య సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోలయ్య, సిహెచ్ఒ సత్యనారాయణ, ఎంపిహెచ్ఇఒ మూర్తి, సూపర్‌వైజర్లు శంకర్, నాగమణి, గొరగనమూడి వైద్య, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు పిహెచ్‌సిలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రతి సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు వ్యాధులపై ఇంటింటా సర్వే నిర్వహిస్తారన్నారు. వీరితోపాటు వాలంటీర్లు కూడా సర్వే చేస్తారని తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఫార్మసిస్టు పివి.స్వామి, పిహెచ్ఎన్. పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వరరావు, జి.ఉదయ్‌చందర్, సత్తిబాబు, డి.కమల పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి మెహర్ ఉన్నిసా తెలిపారు. ఈ శిబిరాలు ఈ నెల 30వ తేదీ చినకాపవరం గ్రామం నుంచి ప్రారంభమవుతాయన్నారు. వచ్చేనెల అక్టోబర్ 3న అప్పారావుపేట, 4న చెరుకుమిల్లి, 5న చిన్నమెల్లిపాడు, 6న దుంపగడప, 7న గుమ్ములూరు, 9న కోళ్లపర్రు, పదో తేదీన సిద్ధాపురం, 11న అజ్జమూరు, 12న కుప్పనపూడి, 13న అయిభీమవరం, 18న ఆకివీడు శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పెనుమదం 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో 33 కెవి ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా పెనుమదం సబ్ స్టేషన్ పరిధిలోని పెనుమదం, గుమ్ములూరు రావిపాడు, పైడావ గ్రామాలకు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపివేయనున్నట్లు ఇఇ బి.సురేష్‌కుమార్ తెలిపారు.

సాలిపేటలో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - ఉండి

ఉండి సాలిపేటలో ఉన్న వరసిద్ధి వినాయకుని ఆలయం 61వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు చేతుల మీదుగా గురువారం సాయంత్రం 61 మంది వృద్ధులకు వస్త్రదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ 61 సంవత్సరాలుగా స్వామివారి చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 1500 మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, పార్టీ గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున్ పాల్గొన్నారు.